సాక్షి సూర్యాపేట

సోమవారం । 14 । ఆగస్టు । 2023



పరారీలో చిట్టీల వ్యాపారి?

చిట్టీల వ్యాపారి రూ.4 కోట్లతో ఉడాయించిన ఘటన శాలిగౌరారం మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. - 8లో



దైవదర్శనానికి వెళ్లొస్తూ..

దైవదర్శనానికి వెళ్లొస్తుండగా నేరేడుచర్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. - 8లో



భగ్గుమన్న భూ తగాదాలు

తుంగతుర్తి మండలం బండరామారంలో భూ తగాదాలో ముగ్గురు వ్యక్తులు గొడ్డలితో ఒకరిపై దాడి చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



యాగంలో పాల్గొన్న సీఎస్ శాంతికుమారి

ఆలేరురూరల్: ప్రతిఒక్కరూ భక్తిభావం, దైవ చింతనను అలవర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో శ్రీమాతాపితృ గోక్షేత్రంలో కొన సాగుతున్న మహారుద్రయాగంలో ఆదివారం ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గోమాతల ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. నిత్యం సమస్యలతో బాధపడుతున్నవారు ఒక్కసారైనా దేవుడిని తలుచుకోకుండా ఉండలేరన్నారు. గోక్షేత్రంలో మూడు రోజులు పాటు ఇంతపెద్ద యాగాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కొలుపాక గ్రామంలోని జైన మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశార. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెంకట్‌రెడ్డి, బిజుమళ్ల బిందుమాధవ శర్మ, పులిసీతారామ శర్మ, కుమార్, సత్యం, సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్వపల్లి పీహెచ్‌సీ ఎదుట రెండో ఏఎన్‌ఎంల నిరసన



నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

అర్వపల్లి : తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండంలోని రెండో ఏఎన్‌ఎంలు ఆదివారం అర్వపల్లి పీహెచ్‌సీ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు విజయశాంతి, నాగరాణి, శకుంతల, ఊర్మిళ, గిరిజ, శ్వేత పాల్గొన్నారు.

నాగార్జున సాగర్‌లో పర్యాటకుల సందడి



లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్: నాగార్జున సాగర్ జలాశయం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు లాంచీల్లో నాగార్జునకొండకు వెళ్లి అక్కడ మ్యూజియంలో అలనాటి నాగరికత విశేషాలతో పాటు, బుద్ధుడి శిల్పాలు, చైత్యాలు, కృష్ణా నది తీరం నుంచి ఇతర ప్రాంతాలకు పడవల్లో చేసిన వ్యాపార సంబంధిత ఆనవాళ్లను పరిశీలించారు. అనంతరం జలాశయతీరంలో నిర్మాణమైన బుద్ధవనాన్ని సందర్శించారు.

యాదాద్రిలో శాస్త్రోక్త పూజలు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి క్షేత్రంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం నిర్వహించి, నిజాభిషేకం జరిపించారు. సహస్రనామార్చన విశేషంగా చేపట్టి, తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు విశేషంగా చేపట్టారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

దరఖాస్తులు 58,500

జిల్లా వ్యాప్తంగా 'గృహలక్ష్మి'కి అందిన అప్లికేషన్లు

- అత్యధికంగా తుంగతుర్తి.. అత్యల్పంగా సూర్యాపేట నుంచి..
- నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 12 వేల ఇళ్లు మంజూరు
- లబ్ధిదారులకు మూడు విడతల్లో అందనున్న రూ.3లక్షల ఆర్థికసాయం



చివ్వెంల తహసీల్దార్ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తులు అందిస్తున్న జనం (ఫైల్)

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు దండిగా వచ్చాయి. సొంత స్థలం కలిగి ఉన్న వారు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల ఆర్థికసాయం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే నాలుగు రోజులపాటు జిల్లావ్యాప్తంగా 58,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి మూడు వేల చొప్పున మొత్తం 12 వేల ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థికసాయం అందించాలని నిర్ణయించింది. ఈ నెల 9 నుంచి 12వ తేదీ సాయంత్రం వరకు జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీలతోపాటు మొత్తం 23 మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించారు. అయితే తుంగతుర్తి నియోజకవర్గంలో అత్యధికంగా 15,072 దరఖాస్తులు రాగా సూర్యాపేట నియోజకవర్గంలో అత్యల్పంగా 13,917 మంది దరఖాస్తు చేసుకున్నారు.

నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు



తుంగతుర్తి	కోదాడ
15,072	14,867
హుజూర్‌నగర్	**సూర్యాపేట**
14,644	13,917

20 వరకు దరఖాస్తుల పరిశీలన

సోమవారం నుంచి దరఖాస్తుల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ నెల 20 వరకు ఈ దరఖాస్తుల పరిశీలన చేసి అర్హులు, అనర్హులను గుర్తిస్తారు. ప్రతి నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారిని, ప్రతి మండలానికి ఒక వెరిఫికేషన్ అధికారిని నియమించారు. దరఖాస్తుల పరిశీలన పూర్తికాగానే, అర్హత ఉన్న దరఖాస్తుల నుంచి ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన కోటా ప్రకారం ఇళ్లు మంజూరు చేస్తారు. ఇందులో ఎస్సీలకు 20శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 50 శాతం, దివ్యాంగులకు ఐదు శాతం ఇళ్లను కేటాయిస్తారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులకు రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని మూడు విడతలుగా అందిస్తారు. బేస్‌మెంట్ పూర్తికాగానే మొదటి విడత రూ.లక్ష, రూఫ్ పూర్తికాగానే రెండో విడత రూ.లక్ష, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత చివరిగా మూడో విడతలో మరో రూ.లక్ష ఆర్థిక సాయం అందనుంది. లబ్ధిదారులు తమకు నచ్చిన విధంగా ఇళ్లు నిర్మించుకోవచ్చు. గృహలక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయాన్ని మహిళల పేరిట అందిస్తారు. ఈ పథకం నిరంతరం కొనసాగే పథకమని ప్రభుత్వం పేర్కొంది. దరఖాస్తులు అలాగే స్వీకరించి విడతల వారీగా అందరికి ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

25న తొలి విడత ఆర్థికసాయం మంజూరు

తొలి విడతలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో 12 వేల మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి ఇళ్ల ఆర్థికసాయం అందించి మిగిలిన దరఖాస్తుల వారికి తదుపరి విడతల్లో ఆర్థికసాయం మంజూరు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 20 వరకు పరిశీలనను పూర్తిచేసి లబ్ధిదారుల జాబితాను ఖరారు చేస్తారు. 25న తొలి విడత ఆర్థికసాయం అందించేందుకు నిర్ణయించినట్లు సమాచారం. కాగా దరఖాస్తుల గడువును పొడిగించాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది. నాలుగు రోజుల గడువు మాత్రమే ఇవ్వడంతో తొలి విడతలో తాము దరఖాస్తు చేసుకోలేకపోయామని జిల్లా వాసులు కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడానికి, బ్యాంకు అకౌంట్లు తెరవడానికి సమయం సరిపోనందున దరఖాస్తుల గడువు పొడిగించాలని వారు కోరుతున్నారు.

బోనమెత్తిన భానుపురి



సూర్యాపేటలోని ఊర ముత్యాలమ్మ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



- సూర్యాపేటలో ఊర ముత్యాలమ్మకు బోనాలు సమర్పించిన భక్తులు
- బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక : విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట పట్టణంలో ఆదివారం బోనాల పండుగ సందడి నెలకొంది. స్థానికంగా ఉన్న ఊర ముత్యాలమ్మ అమ్మవారికి పెద్ద ఎత్తున భక్తులు బోనాలు సమర్పించారు. రాత్రి పొద్దుపోయే వరకు భక్తుల రద్దీ ఏ మాత్రం తగ్గకపోవడంతో అధికారులు కట్టుదిట్టమైన భద్రత, అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. దీంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, ఆయన సతీమణి సునీత ఊర ముత్యాలమ్మ అమ్మవారిని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. బోనాల పండుగ నిర్వహించుకుంటున్న సూర్యాపేట పట్టణ ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ ప్రజలపై ఊర ముత్యాలమ్మ కరుణా కటాక్షాలు చూపాలని, సకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండి ప్రజల ఆదాయం పెరగాలని ముత్యాలమ్మ తల్లిని ప్రార్థించినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే ఊర ముత్యాలమ్మ అమ్మవారిని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డితోపాటు ప్రముఖులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



ఊర ముత్యాలమ్మ ఆలయం వద్ద బోనాలతో శివసత్తుల ప్రదర్శన



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి జగదీష్‌రెడ్డి దంపతులు తదితరులు

భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

- ఎస్పీ రాజేంద్ర ప్రసాద్



కమిటీ సభ్యులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

కోదాడ రూరల్: మండల పరిధిలోని ఎర్రవరంలో గల దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్రలక్ష్మీనర్సింహస్వామి సందర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా చూడాలని జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రవరంలోని ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమై పలు సలహాలు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలకు పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించాలన్నారు. భక్తులకు క్యూలైన్‌లు ఏర్పాటు చేయాలని, ఎక్కువ సమయం ఉండే వారికిసౌకర్యాలు కల్పించాలని సూచించారు. కమిటీ సభ్యులు, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ.. భక్తులకు త్వరితగతిన దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ ప్రకాష్, పట్టణ సీఐ రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ నలజాల జగన్నాథం తదితరులు ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ,చెంచు లక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. కల్యాణ తంతులో భాగంగా స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఆలయ ముఖ మండపంలో ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజలు చేపట్టారు. ఈ క్రమంలో మాంగళ్య ధారణ, తలంబ్రాలతో స్వామివారి నిత్య కల్యాణం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



నియామకపత్రం అందజేస్తున్న అంజన్న

సూర్యాపేట: విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జి తూరుగంటి అంజన్న మాదిగ కోరారు. ఆదివారం సూర్యాపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బోడ శ్రీరాములు మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం సూర్యాపేట మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటిపాముల నవీన్, ఉపాధ్యక్షుడు నోముల మహేష్, కార్యదర్శులు దాసరి వెంకన్న, నోముల జానీలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టల మల్లేష్, జిల్లా కో ఇన్‌చార్జి ములకలపల్లి రవి, ఎర్ర వీరస్వామి, దైద వెంకన్న, పాముల హనుమంతు, వీహెచ్‌పీఎస్ నేతలు చింత సాంబయ్య, మిద్దె సైదులు, కత్తుల విద్యాసాగర్, శంకర్, మేడి కలమ్మ, సుమతి, లక్ష్మి, మార్తమ్మ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మలిపెద్ది శంకర్

- ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్

హుజూర్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ కోరారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని వాసవీ భవన్‌లో హుజూర్‌నగర్ ఆఓపా వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 96 మంది విద్యార్థులకు రూ 3.20 లక్షల ఉపకార వేతనాలు, 41 మంది మహిళలకు రూ.200ల చొప్పున పెన్షన్, చీరలు, ముగ్గురికి మహిళలకు గ్రైండర్లు, ఇరువురికి తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలన్నారు. దాతలను శాలువాలు, మెమొంటోలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములు, ఆవోపా హుజూర్‌నగర్ శాఖ అధ్యక్షుడు వంగవీటి హనుమంతరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి లక్ష్మీనరసింహారావు, మాజీ అధ్యక్షుడు గజ్జి ప్రభాకర్, కుక్కడపు రామ్మోహన్‌రావు, గెల్లి రాంమోహన్ రావు, పెనుగొండ శ్రీనివాస్, కె.రామారావు, గెల్లి విద్యాసాగర్, వి.నాగేశ్వరరావు, ఎస్ అశోక్, ఐ.రమేష్, జి.రమేష్ బాబు, వి.నర్సింహారావు పాల్గొన్నారు.

కమ్మ కులస్తులకు సముచిత స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ కుమార్

కోదాడ: కమ్మ కులస్తులకు పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలని కమ్మ రాజకీయ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు కోదాడలో ఆదివారం జరిగిన కమ్మ రాజకీయ వేదిక సభలో ప్రతినిధులు పలు అంశాలపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండు రంగారావు, టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ కుమార్ మాట్లాడుతూ ఈ సమావేశం నుంచి కమ్మ రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కమ్మ రాజకీయ వేదిక కార్యాలయం ప్రారంభించడంతో పాటు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అక్టోబర్‌లో కమ్మ గర్జనను ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించిందన్నారు. పది ఎమ్మెల్యే, రెండు లోక్‌సభ సీట్లు కమ్మలకు కేటాయించాలన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కమ్మ ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ గోపాలం విద్యాసాగర్, హైదర్‌గూడ మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, కార్యవర్గ సభ్యులు పెదనాటి వెంకటేశ్వరరావు, ఈదుప్పగంటి సుబ్బారావు, వేముల పృథ్వి చౌదరి, జాస్తి సత్యనారాయణ చౌదరి, బి.జ్యోతి, నున్న రామకృష్ణ, రామేశ్వర్‌రావు, రావెళ్ల సీతారామయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలని..

నేటి నుంచి ఉచితంగా గాంధీ సినిమా ప్రదర్శన

- 24వ తేదీ వరకు 14 థియేటర్లలో..
- అన్ని ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ



తిరుమలగిరిలో గాంధీ సినిమా చూస్తున్న విద్యార్థులు (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): భారత స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన థియేటర్లలో జాతిపిత మహాత్మాగాంధీ సినిమాను ఉచితంగా ప్రదర్శించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించే ఉద్దేశంతో ఈ సినిమాను ప్రదర్శిస్తున్నారు. అయితే చిన్నారుల తోపాటు వారి తల్లిదండ్రులు, ప్రజలు కూడా వీక్షించే అవకాశం కల్పించారు. ఈ నెల 14వ తేదీన మొదటి రోజు ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు ప్రదర్శన ఉంటుంది. 15న సాయంత్రం, 16న ఆదివారం చిత్ర ప్రదర్శన ఉండదు. 16 నుంచి 24 వరకు రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర గంటల వరకు ప్రదర్శిస్తారు.

పోరాట స్ఫూర్తిని నింపాలని..

నేటి బాలలకు స్వాతంత్య్ర సమరయోధుల జీవిత గాథలు, దేశం కోసం వారు చేసిన త్యాగాలు తెలియపరుస్తూ.. వారి పోరాట స్ఫూర్తి, దేశభక్తిని చిన్నారుల్లో నింపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంట్లో భాగంగా రెండేళ్లుగా స్వాతంత్య్ర దినోత్సవానికి ముందు రోజుల్లో గాంధీజీ సినిమాను థియేటర్లలో ఉచితంగా ప్రదర్శింపజేస్తోంది. గతేడాది స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా ఆగస్టు 8 నుంచి 22 వరకు గాంధీ చిత్రాన్ని ప్రదర్శింపజేశారు. సుమారు 30 వేల మంది చిన్నారులు ఈ చిత్రాన్ని చూశారు. ఈ ఏడాది 40 వేల మందిని థియేటర్లకు తీసుకెళ్లి సినిమా చూసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో చదువుకునే ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు, కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాల 11, 12 తరగతుల విద్యార్థినులు సైతం సమీప థియేటర్లలో సినిమా చూసేలా పాఠశాలల నిర్వాహకులు, మండల అధికారులు రవాణా సౌకర్యం కల్పించనున్నారు.

జిల్లావ్యాప్తంగా 14 థియేటర్లలో ప్రదర్శన

స్వాతంత్య్ర సాధనలో మహనీయులు చేసిన త్యాగాలు గాంధీ అనుసరించిన అహింసా మార్గంపై నేటి తరానికి అవగాహన కలిగేలా జాతీయ సమైక్యత పెంపొందించేలా ఈ సినిమాను ప్రదర్శిస్తున్నారు. సమరయోధుల గురించి చిత్రాన్ని వీక్షించే అవకాశం గతంలో కలుగలేదు. రెండేళ్లుగా ప్రభుత్వం చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరిలోని 14 థియేటర్లలో ఈ చిత్రాలను ప్రదర్శించనున్నారు. మొదటగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులకు రవాణా కోసం బస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

చిత్ర ప్రదర్శనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందేలా సినిమా హాళ్లలో ఉచితంగా జాతిపిత గాంధీజీ చిత్ర ప్రదర్శనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి.. మండల విద్యాధికారులు, తహసీల్దార్లు, రవాణా శాఖాధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశం మేరకు అధికారులు, సినిమా హాళ్ల యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులకు సినిమా చూపించిన అనంతరం వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. జాతిపిత జీవిత చరిత్రను తెలియజేసే చిత్రాన్ని విద్యార్థులంతా వీక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈఓ అశోక్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ హేమమాలిని, డీపీఆర్ఓ ఏ.రమేష్ కుమార్, థియేటర్ల యజమానులు ఎంఈఓలు పాల్గొన్నారు.

గతేడాదే సినిమా చూశాను



గత ఏడాది గాంధీ సినిమా చూశాను. దీని ద్వారా దేశ స్వాతంత్య్రం కోసం జరిగిన ఉద్యమాలు, పోరాడిన యోధులు, వారి త్యాగాల గురించి తెలుసుకున్నా. వారి త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్య్రమని అర్థమైంది.

– నిక్షిత్‌రెడ్డి, విద్యార్థి, తిరుమలగిరి

కళ్లకు కట్టినట్లు చూపారు



అహింసా మార్గంలో ఉద్యమించిన జాతిపిత గాంధీజీ దేశానికి స్వాతంత్య్రాన్ని ఎలా సాధించి పెట్టారో కళ్లకు కట్టినట్లు సినిమా ఉంది. పోయిన సంవత్సరమే సినిమా చూశాను. దేశం కోసం పోరాడిన సమరయోధుల పాత్ర ఎనలేనిది.

– అక్షిత, విద్యార్థిని, తిరుమలగిరి

క్లుప్తంగా

గీతకార్మికుడికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్

కట్టంగూర్ : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి.ఈ ఘటన మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. అయిటిపాముల గ్రామానికి చెందిన గీత కార్మికుడు నీలం చంద్రశేఖర్ రోజు వారీ మాదిరిగా తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాద వశాత్తు కాలు జారీ కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

పరారీలో చిట్టీల వ్యాపారి..?

- రూ.4కోట్లతో ఉడాయించినట్లు ఆరోపణలు
- నాలుగు నెలలుగా అజ్ఞాతంలోనే..
- 20 రోజుల క్రితం వరకు డబ్బులు ఇస్తానంటూ బాధితులకు సెల్‌ఫోన్ మెసేజ్‌లు
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్న బాధితులు
- శాలిగౌరారం మండలంలో వెలుగుచూసిన మోసం

శాలిగౌరారం : ఓ చిట్టీల వ్యాపారి సభ్యులను నిండా ముంచి రూ.4కోట్లతో ఉడాయించాడు. రాత్రికి రాత్రే బిచానా ఎత్తేసిన అతడి ఆచూకీ నాలుగు నెలలుగా తెలియకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్ల క్రితం కొంతమంది సభ్యులతో చిట్టీల వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఆకట్టుకునే మాటతీరు, నమ్మకం కలిగించే వైఖరితో సదరు వ్యాపారి వ్యాపారాన్ని విస్తరించాడు. మొదట్లో పదుల సంఖ్యలోనే సభ్యులు ఉన్న అతడి చిట్టీల వ్యాపారంలో శాలిగౌరారం, నకిరేకల్, నల్లగొండ, సూర్యాపేట, మోత్కూరు, అర్వపల్లి మండలాలకు చెందిన వారితో పాటు హైదరాబాద్ వాసులతో కలిపి మొత్తం 700 మంది ఉన్నారని తెలిసింది. ప్రస్తుతం ఆయన నిర్వహిస్తున్న వ్యాపారంలో సుమారు 300 మందికి పైగా చిట్టీ పూర్తై డబ్బులు పొందని వారు ఉన్నారు. వారి చిట్టీల విలువ రూ.3 కోట్లు. అంతేగాకుండా అతనిని నమ్మి కొంతమంది అప్పులు కూడా ఇచ్చారు. వాటి విలువ రూ.కోటి వరకు ఉంటుందని సమాచారం.



శాలిగౌరారం మండలం ఆకారంలో పరారీలో ఉన్న చిట్టీల వ్యాపారి ఇల్లు

డబ్బులు రాగానే చెల్లిస్తానంటూ..

సదరు చిట్టీల వ్యాపారి 20రోజుల క్రితం వరకు చిట్టీల సభ్యులకు ఫోన్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిసింది. డబ్బులు రావాల్సి ఉందని.. చేతికి అందగానే గ్రామానికి వచ్చి మీకు రావాల్సిన మొత్తాన్ని సెటిల్ చేస్తానంటూ సెల్‌ఫోన్ మెసేజ్‌లు పెట్టినట్లు బాధితులు పేర్కొంటున్నారు. మెసేజ్‌ల అనంతరం ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్‌లో ఉండేదని తెలిపారు. అయితే, ఇదంతా వ్యాపారి మోసంలో భాగమేనని బాధితులు ఆరోపిస్తున్నారు. కాగా, విషయం తెలిసిన కొంతమంది బాధితులు అతడి ఇంటివద్ద ఉన్న ట్రాక్టర్(ఇంజన్), వాటర్ ట్యాంకర్, ద్విచక్ర వాహనంతో పాటు ఇతరత్రా వస్తువులను ఎవరికి అందినవి వారే తీసుకెళ్లారు. కొంతమంది ఇంటికి తాళం వేశారు.

చిట్టీల డబ్బులతో ఆస్తుల కొనుగోలు..?

చిట్టీల వ్యాపారాన్ని నిర్వహించిన సదరు వ్యాపారి హైదరాబాద్, ఖమ్మం, సిద్దిపేట పట్టణాల్లో స్థలాలు, భవనాలు కొనుగోలు చేసినట్లు సమాచారం. హైదరాబాద్‌లో కొనుగోలు చేసిన ఓ భవనం వివాదాల్లో ఉండి కోర్టులో కేసు నడుస్తున్నట్లు తెలిసింది. వ్యాపారి ఇటీవలే ఆ వివాదాన్ని సెటిల్ చేసుకొని ఆ భవనాన్ని విక్రయించేందుకు ప్రయత్నించడంతో సమాచారం అందుకున్న కొంతమంది బాధితులు హైదరాబాద్‌కు వెళ్లడంతో పసిగట్టిన ఆయన సెటిల్‌మెంట్ కోసం రాకుండా తప్పించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతే కాకుండా తన పేరిట ఉన్న స్థిరాస్తులను మార్పిడి చేసి ఆ తర్వాతా కోర్టును ఆశ్రయించి ఐపీ పెట్టాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది.

గతంలోనూ ఎరువుల వ్యాపారికి..

సదరు చిట్టీల వ్యాపారిపై ఇప్పటికే అనేక ఆర్థికపరమైన ఆరోపణలు, వివాదాలు ఉన్నాయి. గతంలో సూర్యాపేటకు చెందిన ఓ వ్యాపారి వద్ద అతడు ఎరువులు తెచ్చి ఇక్కడ వ్యాపారం చేసి చివరకు అతడికి డబ్బులు చెల్లించకుండా కుచ్చుటోపీ పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు దశాబ్దాల క్రితం తన నానమ్మ వద్ద ఉన్న సుమారు వంద తులాల బంగారం కాజేసి.. ఆ నేరం నక్సలైట్ల మీద తోసి కుటుంబ సభ్యులను సైతం మోసం చేసినట్లు గ్రామస్తులు చెప్పుకోవడం గమనార్హం. ప్రస్తుతం వ్యాపారి నుంచి సెల్ మెసేజ్‌లు కూడా నిలిచిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. పోలీసు కేసు పెడితే డబ్బులు వస్తాయో, రావోననే భావనతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నట్లు తెలుస్తోంది.

బండరామారంలో భగ్గుమన్న భూ తగాదాలు

- ఒకరిపై గొడ్డలితో దాడి.. తీవ్ర గాయాలు



భూ తగాదాల్లో గాయపడ్డ ఉప్పల ఎల్లయ్య

తుంగతుర్తి: తుంగతుర్తి మండలం బండరామారంలో భూ తగాదాలు భగ్గుమన్నాయి. ముగ్గురు వ్యక్తులు గొడ్డలితో ఒకరిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. తుంగతుర్తి మండల పరిధిలోని బండరామారం గ్రామానికి చెందిన ఉప్పుల ఎల్లయ్యకు అదే గ్రామానికి చెందిన కొల్లూరు సోమనరసయ్య, భాస్కర్, మహేష్‌లకు భూ తగాదాలు ఉన్నాయి. రైతులందరు కలిసి ఎస్సారెస్పీ కాల్వ కట్ట నుంచి తమ పొలాల వద్దకు వాహనాలు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసుకున్నారు. ఆ దారికి అయిన ఖర్చులు ఎల్లయ్య చెల్లించపోగా ఆయన పొలంపై ఉన్న రైతులను పోకుండా అడ్డుకుంటున్నాడు. ఆదివారం ఎల్లయ్య తన పొలం వద్దకు ట్రాక్టర్ వేసుకొని వెళ్తుండగా చుట్టుపక్కల ఉన్న రైతులు అడ్డుకొని ప్రశ్నించారు. వారి మధ్య మాట పెరిగి కోపంతో ఎల్లయ్యపై కొల్లూరు సోమనరసయ్య, భాస్కర్, మహేష్‌లు కలిసి గొడ్డలితో దాడిచేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితుడిని కుటుంబ సభ్యులు తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీన్ తెలిపారు.

తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీ



వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్ఐ

హుజూర్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు వేసి ఉన్న రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. హుజూర్‌నగర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనలపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీలో ఉంటున్న బెల్లంకొండ నాగేశ్వరరావు, పాలవరపు వెంకట నర్సమ్మలు ఇళ్లకు తాళాలువేసి ఊరికి వెళ్లారు. రాత్రి సమయంలో దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. నాగేశ్వరరావు ఇంట్లో రూ.15వేల నగదు, కేబుల్‌వైర్ దొంగిలించారు. వెంకట నర్సమ్మ ఇంట్లో వెండి వస్తువులు, బంగారపు ఉంగరం, రూ 3 వేల నగదు అపహరించారు. బాధితులు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

రాష్ట్ర సరిహద్దులో గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బీసన్న

నాగార్జునసాగర్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ బీసన్న కేసు వివరాలు వెల్లడించారు. ఆంధ్రా–తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని నాగార్జునసాగర్ చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మిర్యాలగూడకు చెందిన షేక్‌మీర్జావలి, షేక్ యూసూఫ్ బైక్‌పై వస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని నిలిపి బైక్‌ను తనిఖీ చేయగా సీటు కింద 160 గ్రాముల గంజాయి లభ్యమైంది. అదుపులోకి తీసుకుని విచారించగా తమకు గంజాయి తాగే అలవాటు ఉందని, మాచర్ల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. గంజాయితో పాటు వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. గంజాయి నేరస్తులను పట్టుకున్న విజయపురి ఎస్ఐ ఎస్.సంపత్, పోలీసులను ఆయన అభినందించారు.

ఉరేసుకుని వలస కార్మికుడి ఆత్మహత్య

రామగిరి(నల్లగొండ): ఉరేసుకుని ఓ వలస కార్మికుడి ఆత్మహత్య చేసుకున్నాడు. తిప్పర్తి మండలంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్(కుందన్)(22) తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలయల్లి వద్ద గల సాయి వెంకటేశ్వర రైస్ మిల్లులో హమాలీగా పని చేస్తున్నాడు. సుమారు 6 నెలల క్రితం వివాహం అయింది. 4 నెలల క్రితం రైస్ మిల్లులో హమాలీ పని చేసేందుకు వచ్చాడు. శనివారం అర్ధరాత్రి తర్వాత చాలా సేపటి వరకు ఫోన్‌లో తీవ్రంగా సంభాషణ జరిగింది. ఆ తర్వాత మిల్లు వెనక భాగంలో ఉన్న గోదాములో ఉరి వేసుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున తనతో పాటు పని చేసే కూలీ చూసే సరికి రాజ్‌కుమార్ ఉరి వేసుకుని విగత జీవిలా పడి ఉన్నాడు. మిల్లు యాజమాన్యానికి, పోలీసులకు తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ కలహాల లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ చేపడుతున్నారు.రాజ్‌కుమార్ మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీలో ఉంచారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం మొరిపిరాల పరిధి ఎల్కబావివద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎలకబావివద్ద గ్రామానికి చెందిన బండారి ప్రశాంత్ నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు వద్ద మేస్త్రీ పనులు చేస్తుంటాడు. నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఆదివారం బైక్‌పై తిరిగి వెళుతుండగా గొర్రె అడ్డుగా వచ్చింది. దీంతో బైక్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య..?

- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు



నల్ల సైదులు మృతదేహం (ఫైల్)

ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల పరిధిలోని పాడిచేడులో శనివారం వెలుగులోకి వచ్చిన ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లికి చెందిన నల్ల సైదులు హత్య వివాహేతర సంబంధం నేపథ్యంలోనే జరిగినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. లింగరాజుపల్లి గ్రామానికి చెందిన నల్ల సైదులు(35) బోర్ బండిపై హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పని చేస్తుంటాడు. ఏడాది క్రితమే గ్రామానికి వచ్చి కట్టెకోత పనికి వెళుతున్నాడు. సైదులుకు శాలిగౌరారం మండలం గురజాల గ్రామానికి చెందిన ధనమ్మతో కొన్నేళ్ల క్రితం వివాహం అయింది. వివాహనంతరం ఇద్దరు కుమారులు కలిగారు. కొంత కాలం నుంచి భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో పెద్ద మనుషులు సర్దిచెప్పారు. బుధవారం భార్య ధనమ్మ తన ఇద్దరు కుమారులతో పుట్టింటికి వెళ్లింది. మరునాడు గురువారం భార్యను తీసుకొద్దామని సైదులు గురజాలకు వెళ్లినట్లు తెలిసింది. భార్య రాకపోవడంతో శుక్రవారం సైదులు ఒక్కడే తిరుగు ప్రయాణం అయ్యాడు. అదే రోజు మోత్కూరు మండలం పాడిచేడు మూసీ నది ఒడ్డున గంగదేవమ్మ గుడి సమీపంలో విగతజీవుడై కనిపించాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే సైదులును హత్య చేసి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. రామన్నపేట సీఐ మోతిలాల్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు విచారణ జరుగుంది. శనివారం సాయంత్రం లింగరాజుపల్లి గ్రామాన్ని పోలీసులు సందర్శించారు. గ్రామస్తుల నుంచి కూడా వివరాలు సేకరించారు. హతుడి భార్య ధనమ్మతో పాటు గురజాల గ్రామానికి చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

విద్యుత్ మోటార్లు చోరీ

చిలుకూరు : గుర్తుతెలియని వ్యక్తులు పలువురు రైతుల విద్యుత్ మోటార్లు చోరీ చేశారు. ఈ ఘటన చిలుకూరు మండల కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం నుంచి బేతవోలు గ్రామానికి వెళ్లే రోడ్డులో చిలుకూరుకు చెందిన కాసాని లక్ష్మణ్, అత్తులూరి శ్రీహరి, కొల్లు నాగేశ్వరరావు వ్యవసాయ బావులు ఉన్నాయి. దుండగులు వీరి పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లు, వైర్లను అపహరించుకుపోయారు. ఆదివారం రైతులు వ్యవసాయ భూముల వద్దకు వెళ్లగా చోరీ విషయాన్ని గుర్తించి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

గుర్రంపోడు : మండలంలోని తేనపల్లి గ్రామంలో ఈ నెల 8న ఇంటి నుంచి వెళ్లి పోయిన శివార్ల వెంకటయ్య ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. మతిస్థిమితం సరిగా లేని వెంకటయ్య నల్లగొండ బస్టాండ్ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం తెలియగా తీసుకువచ్చి ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు సహించం

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ క్రైం : కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు సహించబోమని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన తుక్కాని వెంకట్‌రెడ్డిని నల్లగొండ రూరల్ పోలీసులు స్టేషన్‌కు రావాలని పిలిచారు. అదే గ్రామానికి చెందిన దోరెపల్లి మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎంపీ కోమటిరెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అక్కడ ఎస్ఐ లేకపోవడంతో ఫోన్ చేసి మాట్లాడారు. మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి కొట్టడం సరికాదన్నారు. మరో 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని పెద్దల సమక్షంలో పరిష్కారం అయిన చిన్న వివాదాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడం సరికాదన్నారు. తప్పు చేస్తే పిలిపించి మాట్లాడాలి. కావాలని పిలువడమేంటని ఎస్ఐ ప్రశ్నించారు. ఓపిక నశించే వరకు చేయొద్దన్నారు. ఈ విషయమై ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా మహేందర్‌రెడ్డిపై మరికొంత మందితో కలిసి వెంకట్‌రెడ్డి దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారని, ఈ విషయమై మాట్లాడేందుకు పోలీస్ స్టేషన్‌కు పిలిచామన్నారు.

బుద్ధారంలో చిచ్చురేపుతున్న ఆడియో

కొందరు పోకిరీలు సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ మహిళల పట్ల కించపరిచే వ్యాఖ్యలు చేయడం, వివాహేతర సంబంధాలను ఆపాదించడం వంటి మాటల సంభాషణ ఆడియో బుద్ధారం గ్రామంలో చిచ్చురేపింది. గతంలో ఇలాంటి సంఘటనలే జరగడంతో నల్లగొండ రూరల్ పోలీసులు పిలిచి తనదైన శైలిలో మందలించారు. మద్యం మత్తులో ఉన్న పోకిరీలు సెల్‌ఫోన్‌లో మహిళల గౌరవాన్ని కించపరిచేలా లేనిపోనివి ఆపాదిస్తూ సెల్‌ఫోన్‌లో రికార్డు చేయడం, మాటల సంభాషణ నలుగురిలోకి రావడంతో ఆగ్రహానికి ఆజ్యం పోస్తుంది. పోలీసులు సరైన రీతిలో స్పందించకపోతే అనేక కుటుంబాల్లో సెల్‌ఫోన్ చిచ్చు పెడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు.

దైవదర్శనానికి వెళ్లొస్తూ..

- రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు



నేరేడుచర్ల: గాయపడిన ప్రభాకర్

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ధర్వేముల ప్రభాకర్, పద్మ దంపతులు ఆదివారం బైక్‌పై వెళ్లి కోదాడ మండలం ఎర్రవరంలోని బాల ఉగ్రనర్సింహ్మస్వామిని దర్శనం చేసుకున్నారు. సాయంత్రం తిరిగి తమ బైక్‌పై మిర్యాలగూడకు వస్తున్నారు. మార్గమధ్యలో నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ వద్ద మిర్యాలగూడ నుంచి కోదాడ వైపు వెళ్తున్న కారు వీరి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న భార్యభర్తలు కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో పద్మ(45) మృతి చెందింది. ప్రభాకర్ చికిత్స పొందుతున్నాడని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కారు ఢీకొని ..

మునగాల(కోదాడ): జాతీయ రహదారిపై మునగాల మండలం మాధవరం శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన దేశగాని సైదులు (55) తన మనుమడితో కలసి బైక్‌పై సూర్యాపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న సైదులు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. బైక్‌పై ఉన్న సైదులు మనుమడు అరవింద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కోదాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సైదులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.లోకేష్ తెలిపారు.

పరిపాలనా సౌలభ్యానికే నూతన పంచాయతీల ఏర్పాటు



అంతమ్మగూడెంలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: పరిపాలన సౌలభ్యానికే సీఎం కేసీఆర్ మధిర గ్రామాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దారని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని అంతమ్మగూడెంలో రూ.20లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనం, జిబ్లక్‌పల్లి గ్రామంలో రూ.16 లక్షల సీడీఎఫ్ నిధులతో నిర్మించిన పశువైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిలాయిపల్లి సాగునీటి కాల్వలను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. హెచ్ఎండీఏ నిధులతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అర్హులైన పేదలకు త్వరలో నూతన రేషన్‌కార్డులు అందజేస్తామని చెప్పారు. అంతమ్మగూడేనికి మహిళా సంఘం భవనానికి నిధులు మంజూరు చేస్తామని సభలో హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామానికి రేషన్‌షాపు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, వైస్‌ఎంపీపీ పాక వెంకటేశ్, సర్పంచులు వస్పరి పారిజాత, చిన్నలచ్చి లింగస్వామి, ఎంపీడీఓ బాలశంకర్, పశువైద్యాధికారి శ్రీనివాస్, వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షులు సామ రవీందర్‌రెడ్డి, బత్తుల మాధవి, ఎంపీటీసీ రావుల శ్రీదేవి, ఉపసర్పంచులు ఆర్ల లింగస్వామియాదవ్, గుమ్మి జయనరేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పగిళ్ల సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, వస్పరి వెంకటేశ్, వస్పరి జంగమ్మ, బండ బాలమ్మ, వల్లూరి జంగయ్య, అండాలు, గుమ్మి దామోదర్‌రెడ్డి, ముమ్మడి రాజు తదితరులు పాల్గొన్నారు.